క్లుప్తంగా

వెంకయ్యస్వామికి విశేష పూజలు



వెంకయ్యస్వామి సేవలో ఉభయకర్తలు

మనుబోలు: స్థానిక బీసీ కాలనీ సమీపంలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించి విశేషంగా పుష్పాలంకరణ చేశారు. భక్తులు వెంకయ్యస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. చెందులూరు వేణు, సక్కుబాబు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన



నెల్లూరు(బారకాసు): పారిశుధ్య పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే ప్రక్రియను రద్దు చేయాలంటూ కార్మికుల వినూత్న నిరసన ర్యాలీని నగరంలో శనివారం నిర్వహించారు. చెవిలో పూలు పెట్టుకొని బొల్లినేని సెంటర్ నుంచి కొండాయపాళెం గేట్ సెంటర్ వరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ర్యాలీని జరిపారు. ఈ సందర్భంగా నగర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, రూరల్ నేత శివాజీ మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు 12 రోజులుగా ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇచ్చే టెండర్లను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య, నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, సుధాకర్, మాలకొండయ్య, కోటేశ్వరరావు, భాగ్యమ్మ, కొండమ్మ, సుజాతమ్మ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రహణ మొర్రి ఆపరేషన్లు



మాట్లాడుతున్న గురుప్రసాద్

నెల్లూరు(అర్బన్): ఇద్దరు గిరిజన బాలికలకు గ్రహణ మొర్రి ఆపరేషన్లను జయభారత్ ఆస్పత్రి సహకారంతో ఉచితంగా చేయించామని ఆస్పత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న బాలికలు, వారి తల్లిదండ్రులుతో కలిసి నగరంలోని ఆస్పత్రిలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. గిరిజనుల కోసం ఆస్పత్రిలో పది పడకలను ఏర్పాటు చేసి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. గుర్తింపు కార్డులను రాసే క్రమంలో ఇందుకూరుపేట మండలం కొరుటూరు గిరిజనకాలనీలో మానికల జ్యోష్ణవి, వెంకటాచలం మండలం ఈదగాలి గిరిజన కాలనీలో తిరుమలకొండ శ్రీలతకు గ్రహణ మొర్రి ఉందనే విషయాన్ని తమ సిబ్బంది ద్వారా తెలుసుకున్నామని వివరించారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌ను సంప్రదించి చెన్నైలోని మీనాక్షి అమ్మాళ్ డెంటల్ కళాశాల, హాస్పిటల్ వారితో మాట్లాడి వీరికి ఆపరేషన్లను ఉచితంగా చేయించామని వెల్లడించారు. ఇన్‌చార్జి మోపూరు వెంకటేశ్వర్లు, పొట్లూరు శ్రీనివాసులు, డిప్యూటీ మేనేజర్లు మనోహర్, వెంకటేష్, కార్యకర్త బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి ఉచిత దీవెన యాత్ర రేపు

నెల్లూరు(బృందావనం): తిరుమల శ్రీవారి ఉచిత దీవెనయాత్రను సోమవారం నిర్వహించనున్నామని సత్యమార్గ్ ఫౌండేషన్ కన్వీనర్లు పూడి రవిస్వామి, మస్తానమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురమందిరం వద్ద గల జ్యోతి వినాయకస్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభంకానుందని, పాల్గొనాలనుకునే వారు 93466 99526 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏఈఈలుగా ఉద్యోగోన్నతి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ డీఈఈలు అనిల్ కుమార్, వేణుగోపాల్‌కు ఈఈగా ఉద్యోగోన్నతులు లభించాయి. వీరిలో వేణుగోపాల్‌ను గుంటూరు నగరపాలక సంస్థకు బదిలీ చేస్తూ మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలో వీరిని కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ నందన్ సత్కరించారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, డీఈలు ముజాహిద్దీన్, రఘురామ్ పాల్గొన్నారు.

బెల్టుషాపులు ఫుల్..చర్యలు నిల్

- కూటమి ప్రభుత్వంలో పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు
- సర్వేపల్లి నియోజకవర్గంలో 28 దుకాణాల పరిధిలో 350కుపైగా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



వెంకటాచలం: కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. బెల్టుషాపుల్లో రేయింబవళ్లు మద్యం విక్రయాలు సాగిస్తూ పచ్చని కుటుంబాల్లో చిచ్చురేపుతున్నారు. బెల్టుషాపులపై దాడులు జరిపి వాటిని కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తు.. కూటమి నేతల ఒత్తిళ్లతో వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. కొన్ని గ్రామాలకు చెందిన వారు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా కూడా పట్టించుకోక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ మద్యం షాపులు తెరుచుకోవడంతో సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ఊరూరా బెల్టుషాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేసి 24 గంటలూ మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. వాటర్‌ప్లాంట్ లేని గ్రామాలైనా అక్కడక్కడా ఉన్నాయోమోగానీ బెల్టుషాపులు లేని గ్రామాలు లేవని మహిళలు మండిపడుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 28 ప్రైవేట్ మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటికి అనుబంధంగా సుమారు 350కుపైగా బెల్టుషాపులు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండడంతో ఎక్కడా గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేట్ దుకాణాలను తెరవడంతో వాటిని దక్కించుకున్న వారు విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటుకు తెరలేపారు. డిమాండ్‌ను బట్టి ఒక్కో బెల్టుషాపు ఏర్పాటుకు రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వసూళ్లు చేసి అనుమతినిచ్చారు. మరికొన్ని చోట్ల వేలం పాటలు సైతం నిర్వహించి మరీ బెల్టుషాపులను అప్పగించారు. ప్రైవేట్ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం విక్రయించాల్సి ఉండగా, ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారు. ఇక బెల్టు షాపుల్లో ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ.30 నుంచి రూ.60 వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఆర్భాటపు హెచ్చరికలే..

గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపడతామని అధికారులు నిత్యం ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారు. బెల్టుషాపు నిర్వహించే వ్యక్తిని జైలుకు పంపడంతో పాటు ఏ మద్యం దుకాణం నుంచి బాటిళ్లు తెచ్చి అమ్ముతున్నారో సంబంధిత షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అయితే సర్వేపల్లి నియోజకవర్గంలో 116 గ్రామ పంచాయతీలు ఉండగా, దాదాపు అన్నీ గ్రామాల్లో బెల్టుషాపులు ఉన్నాయి. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.



బెల్టుదుకాణంలో మద్యం బాటిళ్లు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా..

అనికేపల్లిలో మూడు బెల్టుషాపులను నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా నిత్యం గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇటీవల గ్రామస్తులు బెల్టు షాపులపై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. అయినా ఎక్సైజ్ అధికారులు బెల్టుషాపుల తొలగింపునకు చర్యలు తీసుకోలేదు. దీంతో ఇక తాము ఎవరికి చెప్పుకోవాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో బెల్టుషాపుల ఏర్పాటుపై మహిళలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. బెల్టుషాపులతో తమ కుటుంబాలు చిన్నా భిన్నమవుతున్నాయని పలు గ్రామాల మహిళలు ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఫిర్యాదులు చేసిన సందర్భాలు ఉన్నాయి. కూటమి నేతల ఒత్తిడి, మామూళ్ల మత్తు కారణంగా ఎక్సైజ్, పోలీస్ శాఖలు బెల్టుషాపులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బెల్టుషాపులపై ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి ఫిర్యాదు చేసినా వారే దాడులపై వాటి నిర్వాహకులకు ముందస్తుగా సమాచారం అందజేస్తున్నారు. అనంతరం తాపీగా వచ్చి నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి ఎక్కడా మద్యం బాటిళ్లు దొరకలేదని వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చర్యలు చేపట్టాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.



బెల్టుదుకాణం వద్దే మద్యం తాగుతున్న వ్యక్తి

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



పొదలకూరు : మాట్లాడుతున్న ఏడీఏ శివనాయక్



కోవూరు: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొదలకూరు : వీఏఏలు, వీహెచ్ఏలు, ఏఈఓలు రైతుసేవా కేంద్రాల పరిధిలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై విస్తృతంగా అవగాహన కల్పించి సాగు దిశగా ప్రోత్సహించాలని పొదలకూరు ఏడీఏ కే శివనాయక్ సూచించారు. స్థానిక ఏఆర్ఎస్‌లో పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని వీఏఏలు, వీహెచ్ఏలు, ఏఈఓలకు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు మూడోరోజు శనివారం ఆయన హాజరై శిక్షణ ఇచ్చారు. నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేయించాలని సూచించారు. ఎస్ఎఫ్ఏ చంద్ర, ఎంటీ సుబ్బయ్య, వెంకురెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

కోవూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారిణి పీ సత్యవాణి అన్నారు . కోవూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి ఏడీఏ కవిత ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై మూడ్రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. తొలిరోజైన గురువారం కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, పద్ధతులు, పర్యావరణం, మానవ ఆరోగ్యంపై ప్రభావంపై శిక్షణ ఇచ్చారు. రెండోరోజు శుక్రవారం విడవలూరు మండలం ముదివర్తిలో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్న పొలాల్లో క్షేత్రస్థాయిలో శిక్షణ అందజేశారు. చివరిరోజైన శనివారం కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి హాజరై ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారులు మునిరత్నం, మీరా, కోటేశ్వరరావు, డిజిటల్ మెంటార్ విజయసింహ, శ్రీరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మడఅడవులను సంరక్షించుకోవాలి



ముత్తుకూరు(పొదలకూరు) : విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అటవీశాఖ అధికారులు



విడవలూరు: అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

ముత్తుకూరు(పొదలకూరు) : పర్యావరణ పరిరక్షణకు తీరంలోని మడ అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీశాఖ అధికారులు అన్నారు. అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మడ అడవుల సంరక్షణపై వక్తృత్వ పోటీలను అటవీశాఖ అధికారులు శనివారం నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం మడ అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు.

విడవలూరు: మండలంలోని రామతీర్థం తీరంలో రూరల్ ఎన్‌లైట్‌మెంట్ అండ్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్, స్వయంకృషి రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో మడ అడవుల పాత్రపై అవగాహన కల్పించారు. మడ అడవులను పెంచడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గ్రామస్తులు తీరాన్ని శుభ్రం చేసి పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు మడఅడవులపై అవగాహన కల్పించి వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం ఫారెస్ట్ అధికారి డీ సుబ్రహ్మణ్యం, ఆమంచర్ల ఫారెస్ట్ అధికారి ఎం శ్రీనివాసులు, ఫారెస్ట్ బీట్ అధికారి ఆర్ శ్రీనివాసులు, మరుపూరు ఎఫ్‌బీఏ ఎస్కే అల్తాఫ్ హుస్సేని, స్వయంకృషి రూరల్, అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీ టీ శ్రీలత, రూరల్ ఎన్‌లైట్‌మెంట్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు కే వందనం తదితరులు పాల్గొన్నారు.

మొగళ్లూరులో బయటపడిన నవశిరస్సుల నాగేంద్రుని శిల

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరులో సిద్ధేశ్వరకొండ వద్ద నవశిరస్సులు కలిగిన నాగేంద్రుని రాతి శిల బయటపడింది. సిద్ధేశ్వరకొండ వద్ద గిరి ప్రదక్షిణ కోసం తవ్వకాలు చేపడుతుండగా రాతి విగ్రహం బయటపడినట్లుగా వార్డు సభ్యుడు పెంచలనారాయణ తెలిపారు. రాతి విగ్రహం ఏకాలానికి చెందినదో గ్రామస్తులు వెల్లడించలేకపోతున్నారు. నాగేంద్రుని శిలకు గ్రామస్తులు ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. త్వరలో పొంగళ్లు పెట్టుకోనున్నామని, దాతలు సహకరిస్తే ఆలయాన్ని కూడా నిర్మిస్తామని గ్రామస్తులు వెల్లడించారు.



నాగేంద్రుని రాతి శిల వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గౌడ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

వెంకటాచలం: జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామిక సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆదివారం ప్రదానం చేయనున్నట్లు గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం జిల్లా కార్యదర్శి కోసూరు సుబ్బయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ కోసూరు పద్మగౌడ్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని పుర మందిరంలో ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 450 మార్కులకుపైగా సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లుగా చెప్పారు. అర్హులైన గౌడ విద్యార్థులు కార్యక్రమానికి హాజరై నగదు పురస్కారాలను అందుకోవాలని కోరారు.


శ్రీవారికి పల్లకిసేవ

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవారికి పల్లకిసేవ జరిపారు. దేవదేవేరులు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చారు.

2న మండల సర్వసభ్య సమావేశం

వెంకటాచలం: మండల సర్వసభ్య సమావేశాన్ని ఆగస్టు 2వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్పన శనివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేత్రదానం



పంది రవి (ఫైల్)

విడవలూరు: స్థానిక పీర్ల చావిడి సెంటర్‌కు చెందిన పంది రవి(48) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల కోరిక మేరకు మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ టెక్నీషియన్ సునీల్ నేత్రాలను సేకరించారు.

పరామర్శ



వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న పూజిత

మనుబోలు: మండలంలోని గోవిందరాజపురానికి చెందిన సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ గుంజి రమేష్ తండ్రి గుంజి వెంకటేశ్వర్లును మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత శనివారం పరామర్శించారు. ఇటీవల గుంజి వెంకటేశ్వర్లు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వారి ఇంటికి పూజిత వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నాయకులు గుంజి రమేష్, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, కాగితాలపూరు ఎంపీటీసీ గుమ్మడి వెంకటసుబ్బయ్య, దాసరి భాస్కర్‌గౌడ్, చల్లా నవకోటి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మినగల్లు భూములకు డీకేటీ పట్టాలు



భూ రికార్డులను పరిశీలిస్తూ లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

బుచ్చిరెడ్డిపాళెం(కొడవలూరు): మినగల్లులోని వందెకరాల భూములకు డీకేటీ పట్టాలు సిద్ధం చేయాలని జేసీ కార్తీక్ రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలంలోని మినగల్లులో వంద ఎకరాల భూమిని పలువురికి 1992లో సీజేఎఫ్ఎస్ కింద ఇచ్చారు. ఆ తరువాత కొంత కాలానికి సీజేఎఫ్ఎస్ పట్టాలు రద్దు కాబడ్డాయి. ఈ భూములకు డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని లబ్ధిదారులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో మినగల్లులోని భూములను జేసీ కార్తీక్ శనివారం పరిశీలించారు. భూముకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం జేసీ విలేకరులతో మాట్లాడుతూ సీజేఎఫ్ఎస్ పట్టాలు రద్దయ్యాక లబ్ధిదారులకు డీకేటీ పట్టాలివ్వడం జరగలేదన్నారు. దీనిపై లబ్ధిదారులు కలెక్టర్‌కు ఇచ్చిన వినతి మేరకు భూములను పరిశీలించడం జరిగిందన్నారు. ఇక్కడ వంద ఎకరాల భూమి సాగులో ఉన్నట్లు గుర్తించామన్నారు. భూమిని సాగుచేస్తున్న రైతులకే డీకేటీ పట్టాలివ్వాలని నిర్ణయించామన్నారు. ఇందుకు సంబంధించి వందెకరాల భూమిని సబ్‌డివిజన్ చేసి ఏఆర్‌సీ కమిటీలో పెట్టి లబ్ధిదారులకు పట్టాలు సిద్ధం చేయాలని ఆర్డీఓ, తహసీల్దార్‌ను ఆదేశించామన్నారు. జేసీ వెంట ఆర్డీఓ అనూష, తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, వీఆర్వో, బాధిత రైతులు ఉన్నారు.

గిరిజనుల గృహ నిర్మాణాలను పూర్తిచేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

మనుబోలు: గిరిజనుల త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఈఈ మోహన్‌రావు స్థానిక అధికారులకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని జట్లకొండూరు, బండేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో మనుబోలు, పిడూరు, జట్లకొండూరు, బండేపల్లి, కాగితాలపూరు, బద్దెవోలు గ్రామాల్లో 104 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం గిరిజనులకు గృహ నిర్మాణాలకు రూ.70 వేలు అదనంగా ఇస్తోందని తెలిపారు. గిరిజనులు సద్వినియోగం చేసుకుని త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ శరత్‌బాబు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ధారా శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

రెండేళ్లకు చేతిబోరుకు మోక్షం



కొడవలూరు: మండలంలోని టపాతోపు గిరిజన కాలనీలోని చేతి బోరుకు రెండేళ్లకు మోక్షం లభించింది. ఇక్కడి గిరిజనులు తాగునీటికి చేతిబోరుపైనే ఆధారపడతారు. ఇంతటి ప్రాధాన్యమున్న బోరు రెండేళ్ల క్రితం మరమ్మతులకు గురైంది. అప్పట్నుంచి గిరిజనులు అధికారులకు మొరపెట్టుకుంటున్నా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో గిరిజనులు గత్యంతరం లేక టపాతోపు గ్రామానికి వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎంపీడీఓ ఏ వెంకటసుబ్బారావు గ్రామాన్ని సందర్శించి సమస్యలపై ఆరాతీయగా తాగునీటి బోరు సమస్యను స్థానికులు ప్రధాన సమస్యగా మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎంపీడీఓ బోరు మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. శనివారం బోరుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చారు.

చిన్నచెరుకూరు–పాపిరెడ్డిపాళెం రోడ్డును

ఆక్రమించిన కంపచెట్లు



తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు–పాపిరెడ్డిపాళెం లింకు రోడ్డును కంపచెట్లు ఆక్రమించాయి. తోటపల్లిగూడూరు నుంచి పాపిరెడ్డిపాళెం, చిన్నచెరుకూరు, నెల్లూరురూరల్ మండలం చింతారెడ్డిపాళెం మీదుగా నెల్లూరు నగరానికి వెళ్లే వారికి ఈ రోడ్డు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. నాలుగు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ లింక్ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి ప్రమాదభరితంగా మారాయి. రోడ్డును సగం మేర కంపచెట్లు ఆక్రమించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మలుపుల వద్ద పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్డును ఆక్రమించి కంపచెట్లను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలివ్వాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నేతలు

నెల్లూరు (టౌన్): బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు దర్గామిట్టలోని డీఈఓ కార్యాలయ ఎదుట నిరసనను యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ పనులతో ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ మాట్లాడారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అసోసియేషన్ అధ్యక్షులు అచ్చయ్య, సుభాషిణి, కార్యదర్శులు సురేంద్రబాబు, నాగిరెడ్డి, ఖాజావలీ, అనిల్‌కుమార్, రమణయ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివస్



బీజేవైఎం నేతల ర్యాలీ

నెల్లూరు (టౌన్): విజయ్ దివస్‌ను బీవీనగర్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్న సైనికుడు, వెటరన్ సార్జంట్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విజయ తన అనుభవాలను వివరించారు. అనంతరం వీర సైనికులకు నివాళులర్పించారు. విజయను శాలువాతో సత్కరించారు. జనహిత వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ దుర్గాప్రసాద్, ప్రిన్సిపల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన భారత జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీని బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గాంధీబొమ్మ సెంటర్‌లో శ్రద్ధాంజలి ఘటించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయుడు, నేతలు కందికట్ల రాజేశ్వరి, యాకసిరి ఫణిరాజు, కార్యదర్శి రత్నంనాయుడు, కుప్పా ప్రసన్న, లోకేష్, విజయ్, ప్రవీణ్, మస్తాన్‌గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.